# జగమంత కుటుంబం నాది

-అపర్ణా దీక్షిత్

"ఏమిటదోలా ఉన్నావు? నేను బయటకువెళ్లాక కొడుకుతోగానీ గొడవ పడ్డావా?" అడిగాడు చలపతి. తల అడ్డంగా వూపింది .

"మొన్న చిన్నాడు వచ్చినప్పుడు నాకిచ్చిన వెయ్యిరూపాయలు కనిపించడంలేదండీ" గొంతు బొంగురుపోయింది పద్మావతికి.

"ఒకచోట దాచి వేరొకచోట వెదుక్కోవడం నీకెప్పుడూ అలవాటేగా. మెల్లగా వెదుకు. కనిపిస్తుందిలే దిగులు పడకు" అన్నాడు ఓదార్పుగా.

"రెండురోజుల నుంచి వెదుకుతున్నాను. బీరువాలో చీరల అడుగున పెట్టాను. అన్ని చీరలూ మడతలు విప్పి మరీ వెదికాను. లేదండీ ఎవరో తీసారు" అంది బాధగా.

అత్తగారు, మామగారి సంభాషణ వంటింట్లో వున్న కోడలు సుశీలకు వినబడింది.

"దొంగతనాలు కూడా మొదలుపెట్టారన్న మాట" కోపంగా అంది.

"పిచ్చి పిచ్చిగా మాట్లాడకు. నేనెవరి సొమ్ము దొంగిలించలేదు"

"ఈ క్షణం నుంచీ మీతో నాకెటువంటి సంబంధంలేదు" చాప పరచుకుని మంచం మీద దిండు తీసుకుని కళ్లు మూసుకుని పడుకుంది.

సుందరానికి పేకాట పిచ్చి. సగం జీతం పేకాటకే తగలేస్తాడు. అతని చేత ఆ అలవాటు మాన్పించడం ఎవరితరం కాలేదు.

ప్రైవేటు స్కూలో పని చేస్తున్న సుందరం స్కూలు నుంచి పేకాటకే వెడతాడు. రాత్రి పదింటికి ఇంటికి చేరుకుంటాడు.

అతను నవ్వుతూ అందరినీ పలకరిస్తే పేకాటతో గెలిచాడనీ, చిరాకు పడుతూ అందరి మీదా అరిస్తే డబ్బు పోగొట్టుకున్నాడని ఇంట్లో వాళ్లందరికీ తెలుసు. నిన్న చాలా ఆనందంగా వచ్చాడు. వచ్చేటప్పుడు భార్యకి ఇష్టమైన మామిడితాంద్ర, తల్లికిష్టమైన స్వీట్ కొనుక్కొచ్చాడు.

పద్మావతి ఆశ్చర్యపోయింది. పేకాటలో బాగా డబ్బు గెలిచి ఉంటాడనుకుందిగానీ ఇలా తన వెయ్యికి రెక్కలొచ్చాయని ఊహించలేదు. రాత్రి పన్నెండు దాటాక రెండు ఐదువందల నోట్లు భార్య చేతిలో ఉంచాడు. విసుక్కుంటూ మంచమెక్కింది సుశీల. వాళ్లిద్దరికీ ఇది మామూలే.

* * *

"మీ వెయ్యిరూపాయలు వెదికిస్తే నాకేమిస్తారు?" నవ్వుతూ అడిగింది సుశీల అత్తగారిని.

"నీకు ఎంత కావాలంటే అంత తీసుకుని మిగిలింది నాకివ్వు" కోడల్ని ప్రేమగా చూస్తూ అంది పద్మావతి.

అత్తమామల ఎదురుగా బీరువాలో బట్టలన్నీ సర్దుతున్నట్లు నటిస్తూ జాకెట్లోని వెయ్యి రూపాయలు ఒక చీరలో పెట్టి దానిని గట్టిగా దులిపి కిందపడ్డ నోట్లని తీసి అత్తగారి చేతిలో వుంచింది.

చలపతి కోడలి వంక మెచ్చుకోలుగా చూసాడు.

పద్మావతి మాత్రం కోడలి కళ్లల్లోకి సూటిగా చూసింది.

సుశీల తల వంచుకుంది.

"డబ్బు దొరికిందిగా? మరెందుకు మీరిద్దరూ ఇలా..."

"నా వెయ్యి రూపాయలు పది వందల నోట్లు. దానికి దొరికింది అయిదు వందల నోట్లు రెండు. రాత్రంతా వాడికి క్లాస్ పీకి వాడి దగ్గర వెయ్యి రూపాయలు వసూలు చేసిందన్న మాట. పెళ్లాం అంటే పడి చస్తాడు. కొద్దిగా శ్రద్ధ తీసుకుంటే వాడి పేకాట వ్యసనం మాన్పించగలదు" అంది మెల్లగా.

"నేను ప్రయత్నించాను అత్తయ్యా. పేకాట రాయుళ్ళందరూ ఆయన ప్రాణస్నేహితులు. చిన్ననాటి నుంచీ ఆయనతో కలిసి చదివిన వాళ్లు. వాళ్ల నుంచి ఆయనను విడదీయం సాధ్యంకాదు. ఈ ఊరిని వదిలి పెడితేగానీ ఆయన బాగుపడరు. అందుకే క్రిందటిసారి అన్నయ్య దగ్గరకెళ్లినప్పుడు ఆయనకి విజయవాడలో జాబ్ చూడమని చెప్పాను. అన్నయ్య అంగీకరించాడు. జాబ్ దొరగ్గానే అన్నయ్య ఫోన్ చేస్తానన్నాడు. మీరు నాకు సహకరిస్తే ఆయన్ని ఈ ఊరి నుంచి దూరంగా తీసుకెళ్లి బాగు చేయించుకుంటాను. జీతం చాలకపోతే నేను కూడా జాబ్ చేస్తాను. మీరు కూడా ఈ ఇల్లు అమ్మేసి నా దగ్గరకు వచ్చేయవచ్చు. మిమ్మల్ని ఇద్దర్నీ నా తల్లిదండ్రుల్లాగా చూసుకోగలను. ఏమంటారు మామయ్యా" అంది.

సుశీల మాటలు విని ఆమె వంక ఆశ్చర్యంగా చూస్తుండిపోయారు.

"ఇప్పటికిప్పుడు చెప్పలేను. నా మిత్రులతో సంప్రదించి రేపు నా నిర్ణయం నీకు చెబుతాను తెలియజేస్తాను" అన్నాడు చలపతి.

మర్నాడు ఉదయం కోడలిని పిలిచి తన నిర్ణయం చెప్పారాయన.

"ఈ ఊరిని, ఈ ఇంటిని పూర్తిగా వదలడం మావల్లకాదు. నా మిత్రులు రాఘవ, శివయ్యా, నేనూ కలసి ఈ ఇంటిని కొన్ని మంచి పనులకు ఉపయోగిద్దామనుకున్నాము. శివయ్య భార్యను, కొడుకును పోగొట్టుకుని వంటరివాడయ్యాడు. రాఘవకి పిల్లలు లేరు. మేనల్లుడినే కొడుగ్గా భావించి చదువు చెప్పించి పెళ్లి చేసాడు. వాడు కాలేజీలోనే గుండెపోటుతో చనిపోయాడు. ఇద్దరు పసిపిల్లలు. ప్రైవేటు కాలేజీ అవడంవల్ల పెన్షన్‌లేదు. కొంత డబ్బు భార్య పేర వేసారు కాలేజీవాళ్లు. పిల్లలను తీసుకుని రాఘవ దగ్గరకు వచ్చేసింది రాధ. జీవితాన్ని





సార్థకం చేసుకోవాలంటే పది మందికి సాయపడాలి. రాధలా జీవితాన్ని కోల్పోయినవాళ్లకి, శివయ్యలాగా వంటరిగా మిగిలిన వృద్ధులకు ఆసరాగా నిలబడాలని నిర్ణయించుకున్నాను. ఈ ఇంటిని అభాగ్యులకు 'ఆసరా'గా మారుస్తాను. నాకూ, రాఘవకి, శివయ్యకి పెన్షన్స్ వస్తున్నాయి. మరి అవి రానివారి పరిస్థితి ఏమిటి? చిన్నపిల్లలకి బడి రాధా, రాఘవ నిర్వహిస్తారు. రాధకి కాలేజీ వాళ్లు ఇచ్చిన డబ్బుతో మన ఇంటి వెనుక ఖాళీ స్థలంలో మరో నాలుగు గదులు కట్టిస్తానంది. చిన్నాడు చాలాకాలం నుంచి తన దగ్గరకు రమ్మని పిలుస్తున్నాడు. అందుకని ముందు హైదరాబాద్ వెళతాము. కొంతకాలం అక్కడ ఉండి తరువాత నీ దగ్గరకు వస్తాము. ఇక్కడి పనులన్నీ పూర్తయ్యాక రాధమ్మని పిలిచినప్పుడు నువ్వు అంగీకరిస్తే నీ పిల్లలు ఇద్దరినీ తీసుకుని ఇక్కడికి చేరుకుంటాము. వాళ్లని చక్కగా చదివించి ప్రయోజకుల్ని చేస్తాను. ఇల్లు అమ్మి తనకివ్వలేదని సుందరం కోపగించుకోకుండా చూడు. నీ పిల్లలిద్దరి బాధ్యత నేను తీసుకుంటాను. అందరి కొడుకుల్లాగా నా కొడుకుల్లో కూడా కాలం మార్పు తేవచ్చు. నేనప్పుడు ఆత్మాభిమానాన్ని చంపుకుని వాళ్ల దగ్గర ఉండలేను. అందుకే బాగా ఆలోచించి ఈ నిర్ణయం తీసుకున్నాను'' అన్నారాయన.

"మీ నిర్ణయం నాకు చాలా ఆనందాన్ని కలిగించింది మామయ్యా. 'ఆసరా' అభివృద్ధి చెందితే మేము కూడా ఇక్కడికే వచ్చి పెద్దలకు సేవ చేస్తాం'' అంది రత్నం ఆనందంగా.

"అవును. నా తరువాత 'ఆసరా'ని నువ్వే నిర్వహించాలి తల్లీ'' ఆప్యాయంగా అన్నాడు చలపతి.